www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 165 | హైదరాబాద్ | మంగళవారం | 02-09-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## కీలక నిర్ణయం.. వరద బాధితులకు పరిహారం ఆదేశాలు




సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :

భారీ వర్షాలకు రాష్ట్రంలో జరిగిన నష్టంపై సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గత ఏడాది వర్షాల కారణంగా జరిగిన నష్టానికి కేంద్రం నుంచి నిధులు రాకపోవడం మీద ఆయన ఆరా తీసుకున్నారు. సీఎం అధికారులు తక్షణమే కేంద్రానికి వివరాలు అందించాలని ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో చెరువులకు ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని చెరువుల పరిస్థితి పైన సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం పేర్కొన్నారు. పంటలకు వచ్చిన నష్టం అంచనా వేయించి, తక్షణమే నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వరదల సమయంలో గల నైపుణ్యాలను మరింత పెంపొందించాలని, ఎన్డీఆర్ఎఫ్ తో పని లేకున్నా కూడా సిద్ధంగా ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో 1052 చోట్ల 1023 కిలోమీటర్ల మేరకు రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు గుర్తించారు. రోడ్ల డ్యామేజ్ పై సమగ్ర నివేదిక తయారు చేయాలని, హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల నోటిపై వెంటనే పరిశీలనలు జరగాలని సీఎంఆర్ ఆదేశించారు. వరదలలో చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల పరిహారం, చనిపోయిన జంతువులకూ పరిహారం అందించాలి. కలెక్టర్లు, ఎస్పీలు జిల్లా స్థాయిలో ఉండి, కిందస్థాయి అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పై సమగ్ర నివేదిక తయారు చేసి కేంద్రానికి సమర్పించాలని సీఎం ఆదేశించారు.

# హరీశ్ రావు, సంతోష్ నాపై కుట్రలు చేశారు: కవిత సంచలన ఆరోపణలు

- వారిద్దరు తనపై ఎన్నో కుట్రలు చేశారన్న కవిత
- రేవంత్‌తో వారికి లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపణ
- కేసీఆర్‌కు అంటిన మరక వెనుక హరీశ్ రావు లేరా? అని ప్రశ్న

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ తనపై ఎన్నో కుట్రలు చేశారని, అయినప్పటికీ తాను నోరు మెదపలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్ రావు, సంతోష్ వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారని సంచలన ఆరోపణలు చేశారు. వారి మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని ఆమె అన్నారు. అందుకే రేవంత్ రెడ్డి వారిద్దరిని ఏమీ అనడం లేదని అన్నారు.

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయిందని రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తండ్రి కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని, అందులో ఐదేళ్ల పాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్ రావు పాత్ర లేదా? అని ప్రశ్నించారు. సంతోష్, హరీశ్ రావు, మేఘా ఇంజినీరింగ్ వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందని ఆమె అన్నారు.

ఈరోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నానని అన్నారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి, లేకపోతే ఏంటి అని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇది తన తండ్రి పరువుకు సంబంధించిన విషయమని ఆమె అన్నారు. తన లేఖ గతంలో బయటకు వచ్చినప్పటికీ తాను ఎవరి పేర్లనూ బయటపెట్టలేదని తెలిపారు. కేసీఆర్ జనం కోసం పనిచేస్తే అవతలి వాళ్లు ఆస్తుల పెంపు కోసం పనిచేశారని ఆరోపించారు.

కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారని కవిత అన్నారు. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఇబ్బంది పడ్డారు... అలాంటి దేవుడి లాంటి వ్యక్తిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించడం బాధగా ఉందని అన్నారు. కేసీఆర్‌ను నిన్న అన్ని మాటలు అంటుంటే ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు పెడతారు కానీ సుప్రీం కోర్టు వరకు వెళ్లి ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. బీహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను బలి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ కాదు.. ఇంకే విచారణ జరిపినా కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## చంద్రబాబు, పవన్, కేసీఆర్, జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నా... తెలుగువాడికి అవకాశం వచ్చింది: రేవంత్ రెడ్డి

- ఉప రాష్ట్రపతి బరిలో నిలిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి
- రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలు పక్కన పెట్టాలన్న రేవంత్ రెడ్డి
- ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతివ్వాలన్న ముఖ్యమంత్రి

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :



ఉపరాష్ట్రపతిగా తెలుగు వ్యక్తిని గెలిపించుకునే అవకాశం వచ్చిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మద్దతు ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులకు ఆయన విజ్ఞప్తి చేశారు. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నాను. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కన పెట్టి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి" అని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని తెలిపారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యం ఉందని అన్నారు.

రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే అజెండాతో ఎన్డీయే అభ్యర్థిని నిలబెట్టిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలోకి దింపిందని చెప్పారు. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చని, కానీ తెలుగు వ్యక్తికి అవకాశం వచ్చిందని వ్యాఖ్యానించారు.



## బెదిరింపులు, కేసులు బీఆర్ఎస్‌కు కొత్త కాదు: కేటీఆర్

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :

కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా ఇవాళ, రేపు రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. మండల మరియు జిల్లా కేంద్రాల్లో వివిధ రూపాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలపనున్నాయి. ఈ క్రమంలో ధర్నాలు, రాస్తారోకోలు, బైక్ ర్యాలీలు ఇతర నిరసన రూపాల్లో నిరసనలకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది.

బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి నదీ జలాలను ఆంధ్రాకు తరలించేందుకు రేవంత్ కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. బీజేపీకాంగ్రెస్ కలిసి చేస్తున్న ఈ కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇది కేసీఆర్‌పై చేస్తున్న కుట్ర మాత్రమే కాదని.. తెలంగాణ నదీ జలాలను పక్క రాష్ట్రాలకు తరలించి, కాళేశ్వరాన్ని ఎండబెట్టే ప్రయత్నంలో భాగంగానే జరుగుతున్నదని తెలిపారు.

సీబీఐకి కాళేశ్వరం అప్పజెప్పడం అంటే పూర్తిగా ప్రాజెక్టును మూసేయడమే అని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. నిన్నటిదాకా సీబీఐ పైన వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఒక్కరోజులోనే మాట ఎందుకు మార్చాడని నిలదీశారు. దీని వెనుక ఉన్న శక్తులు వాటి ఉద్దేశాలు ఏమిటో ప్రజలకు తెలియజెప్పాలని డిమాండ్ చేశారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్ బీజేపీ ఆడుతున్న నాటకమని.. వాళ్ళు చేస్తున్న కుట్రనే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీబీఐకి ఇచ్చినా ఏ ఏజెన్సీకి ఇచ్చినా భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్రంతో కలిసి కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటామని తెలిపారు. బెదిరింపులు కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్త కాదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని పోరాటాలైనా, త్యాగాలైనా చేస్తామని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ అధికారిక వాట్సప్ గ్రూపుల నుంచి కవిత పీఆర్‌వో తొలగింపు

- కవిత వ్యాఖ్యల ఎఫెక్ట్
- బీఆర్ఎస్ అధికారిక వాట్సప్ గ్రూపుల నుంచి కవిత పీఆర్‌వో తొలగింపు
- కవిత ఎక్స్, ఇన్‌స్టా, ఫేస్ బుక్‌ల నుంచి అన్‌ఫాలో అవుతున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు.

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :

ఎమ్మెల్సీ కవిత చేసిన సంచలన వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీలో తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తాజాగా కవిత పీఆర్‌వోను పార్టీ అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి తొలగించినట్లు సమాచారం. పార్టీ అంతర్గతంగా ఆమెపై వ్యతిరేక వాతావరణం పెరుగుతోందని ఇదే సంకేతమని భావిస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికల్లోనూ కవితకు దూరమవుతున్నట్లు కనిపిస్తోంది. ఆమె ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్లను ఫాలో అవుతున్న పలువురు నేతలు, కీలక కార్యకర్తలు అన్‌ఫాలో చేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కవిత వ్యాఖ్యల వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోందని, ఆ ప్రభావం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో కవిత చేసిన ఆరోపణలు, పార్టీ లోపల తలెత్తుతున్న విభేదాలు బీఆర్ఎస్ భవిష్యత్తుపై ఎంతవరకు ప్రభావం చూపుతాయో చూడాలి.



# నిమ్స్‌లో ఉచిత గుండె ఆపరేషన్లు..!

- పుట్టుకతో గుండె వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు నిమ్స్ ఉచిత శస్త్రచికిత్సలు
- సెప్టెంబర్ 1 నుండి 21 వరకు ప్రత్యేక వైద్య శిబిరం
- బ్రిటన్ వైద్యుల సహకారంతో ఆపరేషన్లు
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా మొత్తం ఖర్చు భారం రాష్ట్ర ప్రభుత్వమే

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :




మన సమాజంలో అత్యంత బాధ కలిగించే నిజం ఏమిటంటే, పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధులతో చిన్నారులు బాధపడటం. ఆర్థికంగా బలమైన కుటుంబాలు పెద్ద ఆసుపత్రుల్లో ఆధునిక చికిత్స పొందగలిగినా, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు మాత్రం చికిత్స కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటాయి. చాలా మంది తల్లిదండ్రులు తమ బిడ్డల ప్రాణాలను కాపాడటానికి ఆర్థిక సహాయం కోసం ఇతరులను వేడుకోవాల్సి వస్తోంది.

ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి తీసుకున్న నిర్ణయం మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రకటించారు. సెప్టెంబర్ 1 నుంచి 21 వరకు నిమ్స్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించబడుతుంది. బ్రిటన్ వైద్యుల సహకారంతో ఈ శిబిరంలో చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ముందుగా పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అవసరమైన వారికి తక్షణమే ఆపరేషన్లు చేస్తారని తెలిపారు.

ఈ శస్త్రచికిత్సలకు అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా భరిస్తోంది. అంటే తల్లిదండ్రులకు ఒక్క రూపాయి భారమూ పడదని నిమ్స్ అధికారులు హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ బీరప్ప వివరాల ప్రకారం, నిమ్స్ ఆసుపత్రి పాత భవనంలోని సీటీవీఎస్ కార్యాలయంలో డా. అమరేష్ రావు, డా. ప్రవీణ్, డా. గోపాల్ వంటి నిపుణ వైద్యులు పిల్లలను పరీక్షించనున్నారు. ప్రతి మంగళవారం, గురువారం, శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పిల్లల తల్లిదండ్రులు అంతకుముందు తీసుకున్న రిపోర్టులు, సీటీస్కాన్ డాక్యుమెంట్లు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఆసుపత్రి అధికారులు సూచించారు.

## కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారు.. వారి వద్ద కోట్ల రూపాయలు దొరకడం ఏంటి?

- కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారు
- ఏఈ, ఎస్ఈ ల వద్ద కోట్ల రూపాయలు దొరకడం ఏంటి?
- కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించడం అనేది గొప్ప నిర్ణయం

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :



కాళేశ్వరాన్ని కామధేనువుగా మార్చుకున్నారనే తమ మాట నిజం అయ్యిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ అగ్ర నేతలు కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారని.. ఏఈ, ఎస్ఈ ల వద్ద కోట్ల రూపాయలు దొరకడం అంటే ఏమిటి? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం అన్ని వర్గాల, పక్షాల సూచనల మేరకు గొప్ప నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకున్నారని ప్రశంసించారు. కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించడం అనేది గొప్ప నిర్ణయం అని కొనియాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... 'నిన్న అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం అన్ని వర్గాల, పక్షాల సూచనల మేరకు గొప్ప నిర్ణయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్నారు. సీబీఐకి కాళేశ్వరం అంశాన్ని అప్పగించడం అనేది గొప్ప నిర్ణయం. ఎలాంటి పక్షపాతం లేకుండా సీబీఐకి అప్పగించడం అంటే పారదర్శకంగా ఉన్నామని సందేశం ఇవ్వడం. గతంలో సీబీఐకి అప్పగించాలని బీజేపీ సూచించింది. కాళేశ్వరాన్ని కామధేనువుగా మార్చుకున్నారనే మా మాట నిజం అయ్యింది. బీఆర్ఎస్ అగ్ర నేతలు కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారు. ఏఈ, ఎస్ఈ ల వద్ద కోట్ల రూపాయల దొరకడం అంటే ఏమిటి?. మాజీ మంత్రులు నిన్న హరీష్ రావు, కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ సభ్యులు బాడీ లాంగ్వేజ్ ఏ విధంగా ఉందో అందరూ చూశారు. బీజేపీ ఐడియాలజీని మా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ విమర్శిస్తుంది. ఈ రెండు పార్టీలు విరుద్ధ భావజాలం కలిగినవి.. ఎప్పుడూ కలవలేదు' అని అన్నారు.

'గతంలోనే మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాళేశ్వరంపై విచారణ చేస్తామని చెప్పాం. కేంద్ర సంస్థగా ఉన్న సీబీఐకి అప్పగించాం. తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్న సంస్థలకు ఇస్తే.. కక్ష సాధింపు చర్యలకు పాల్పడతారని ఆరోపిస్తారు. అందుకే కేంద్ర సంస్థకు అప్పగించడం జరిగింది. సీబీఐని గతంలో ఆయా అంశాలపై విమర్శించాం. కానీ కాళేశ్వరం అంశం ప్రత్యేక అంశంగా పరిగణించడం జరిగింది. మేము విమర్శలకు తావు లేకుండా కేంద్ర దర్యాప్తు సంస్థకి అప్పగించాం. పారదర్శకంగా ఈ విచారణ జరగాలి. రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం. గతంలో అమిత్ షా, మోదీలు కూడా కాళేశ్వరాన్ని అడ్డు పెట్టుకుని కేసీఆర్ సంపాదించారని అన్నారు. కేసీఆర్ కుట్ర కోణంతో ఇదంతా చేశారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఈ కుంభకోణాన్ని వెలికి తీసేందుకు ఈ విచారణ జరుగుతుందని నమ్ముతున్నాం' అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ కుట్రలకు నిరసనగా సూర్యాపేటలో బీఆర్ఎస్ ధర్నా

సిద్దిపేట(పవర్), సూర్యాపేట :

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా సూర్యాపేటలో బీఆర్ఎస్ పార్టీ ధర్నా నిర్వహించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం సూర్యాపేట నియోజకవర్గంలో రైతులు, కార్యకర్తలతో పెద్దఎత్తున ధర్నా నిర్వహించినట్లు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎక్స్ వేదికగా తెలిపారు.

తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి నదీ జలాలను ఆంధ్రకు తరలించేందుకు రేవంత్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేస్తున్న ఈ కుట్రలను ఎదుర్కోవాలని పార్టీ క్యాడర్‌కు జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇది కేసీఆర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర మాత్రమే కాదని, తెలంగాణ నదీ జలాలను పక్క రాష్ట్రాలకు తరలించి, కాళేశ్వరాన్ని ఎండబెట్టే ప్రయత్నంలో భాగంగానే ఈ కుట్ర జరుగుతున్నదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పజెప్పడం అంటే ఆ ప్రాజెక్టును పూర్తిగా మూసేయడమేనని పేర్కొన్నారు.

నిన్నటిదాకా సీబీఐ గురించి వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఒక్క రోజులోనే మాట ఎందుకు మార్చాడని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న శక్తులు ఏవో, వాటి ఉద్దేశాలు ఏమిటో.. ప్రజలకు తెలియజెప్పాలని పార్టీ శ్రేణులను కోరారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న కుట్ర అని మండిపడ్డారు. కాళేశ్వరం కేసును కాంగ్రెస్ పార్టీ సీబీఐకి ఇచ్చినా, మరే ఏజెన్సీకి ఇచ్చినా భయపడేది లేదని సవాల్ చేశారు.

కేంద్రంతో కలిసి కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటామని, బెదిరింపులు కేసులు తమ పార్టీకి కొత్త కాదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని పోరాటాలైనా, త్యాగాలైనా చేస్తామని స్పష్టంచేశారు.



కాళేశ్వరం ప్రాజెక్ట్ పైన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశానుసారం సూర్యాపేట నియోజకవర్గంలో రైతులు కార్యకర్తలతో పెద్ద ఎత్తున ధర్నా నిర్మించడం జరిగింది

# ఉద్యోగ విరమణ వీడ్కోలు అభినందన సన్మాన సభ

- **ముఖ్యతిధిగా గజ్వేల్ ని ఆర్ యస్ వంటేరు ప్రతాప్ రెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:**



గజ్వేల్ మండలం శోభ గార్డెన్ లో శ్రీగిరిపల్లి గ్రామ కాసుల వెంకట్ రెడ్డి జగదేవపూర్ మండలం ఇటిక్యాల్ ఎస్ఏ. సోషల్ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ఇటిక్యాల పదవి విరమణ సభ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్యతిధిగా గజ్వేల్ నియోజకవర్గం బీ ఆర్ యస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి జగదేవపూర్ మండలం యం ఈవో ఎం మాధవ రెడ్డి పి ఆర్ టి యూ మండల అధ్యక్షులు చిలుకూరి వెంకట్ రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సర్వ సాధారణము అయినప్పటికిని ఉపాధ్యాయుల వృత్తి చాలా గొప్పది ఎంతోమంది విద్యార్థులను తయారు చేసి దేశ భవిష్యత్తుకి తోడుపాడుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు అమ్మ

ఆదర్శ పాఠశాల కమిటీ. విద్యార్థులు కుటుంబ సభ్యులు అండ్ బంధుమిత్రులు గజ్వేల్ ఎస్ఐ ఉమారెడ్డి మహేందర్ రెడ్డి బుచ్చిరెడ్డి నరసింహారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కృష్ణారెడ్డి రాజిరెడ్డి ఎల్లారెడ్డి గజ్వేల్ నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి బంధుమిత్రుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పదవి విరమణ వీడ్కోలు అభినందన సన్మాన సభ గజ్వేల్ మున్సిపల్ పరిధి ధర్మారెడ్డి పల్లి రింగ్ రోడ్ దగ్గర ప్రైవేట్ ఫంక్షన్ హాల్ శోభా గార్డెన్లో కాసుల వెంకట్ రెడ్డి పదవి విరమణ విరమణ సెలబ్రేట్ ఫంక్షన్ గ్రాండ్ గా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బంధు మిత్రులు కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు హేమలత పావని శ్రావణి సందీప్ రెడ్డి హరీని నర్సింహ్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బొజ్జ గణపయ్యకు ఘనంగా పూజలు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 1 ప్రతినిధి**

చిట్టాపూర్ డబుల్ బెడ్రూం ఆర్ ఎల్ ఆర్ కాలనీ లోవినాయక విగ్రహం ఏర్పాటు చేసుకొని తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషలతో ఉండాలని అవినాయకునికి ప్రత్యేకంగా పూజలు చేసారు రెంబో యూత్ ఆధ్వర్యంలో అన్నాప్రసాదం స్వీకరించారు. దీనికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి అక్బర్ పేట్ భూంపల్లి ఎస్ ఐI హరీష్ గౌడ్ .బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి ర్యాకం శ్రీరాములు వారి బృందం జందరు పి ఎస్ నాగేశ్వరు రావు. హరికృష్ణ నర్సింలు . రెయిన్బో యూత్ సభ్యులు. పాలేటి ప్రశాంత్. ర్యాకం తరుణ్.

మొనగారి సాయి కమాటం బన్నీ కమాటం కిషోర్ చౌదం కిషోర్ ర్యాకం కమల్ ర్యాకం సురేష్ ర్యాకం బాబు.మంతురిప్రణయ్ ర్యాకం అజయ్. కమాటం మనోహర్ కమాటం స్వామి తదితరులు పాల్గొన్నారు



# క్రమశిక్షణ, కఠోర శ్రమ తోనే ఉన్నత శిఖరాలకు...

- **కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**
- **స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ 69వ గేమ్స్ ప్రారంభం**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 01 ( సిద్దిపేట పవర్) :**

సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరిధి 69 వ స్కూల్ గేమ్స్ (కబడ్డీ ,ఖోఖో)ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సోమవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యతో పాటు క్రీడల ఆవశ్యకతను వివరించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణ, కఠోర శ్రమ చాలా అవసరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి పిల్లలలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి క్రీడలకు బడ్జెట్లో కూడా అధిక నిధులు కేటాయించేలా చేశారన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలంపిక్ క్రీడలలో 2 ఈవెంట్లను తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు కూడా ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని ఆసరాగా చేసుకుని విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించి దేశంలో తెలంగాణ కీర్తి పతాకను ఎగరవేయాలని చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రియదర్శిని, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ సుధాకర్, డిప్యూటీ డిఇఓ గుండప్ప, ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ప్రసన్న, మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

# బీడు భూముల్లో పంటలు పండిస్తే కేసులా??

**చేర్యాల, సెప్టెంబర్ 1 (సిద్దిపేట పవర్)**

కాళేశ్వరం తో ఎన్నో వేల ఎకరాలలో పంటలు పండించిన కేసీఆర్ మీద కేసులు పెట్టడం పనికిమాలిన చర్య అని చేర్యాల బి.ఆర్.ఎస్ నాయకులు అభివర్ణించారు..ఈ సందర్భంగా వారు స్థానిక గాంధీ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని కాళేశ్వరం నీళ్లతో సస్యశ్యామలం చేసి, ఆసియాలో నే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను కట్టిన కేసీఆర్ మీద కేసులు పెట్టడం తగదని వారు హెచ్చరించారు..మీరు ఎన్ని కేసులు పెట్టిన, వచ్చే ఎన్నికల్లో బి.ఆర్.ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని వారు తెలిపారు.. కార్యక్రమంలో చేర్యాల మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు



# రికార్డు ప్రయాణంతో నెలలు నిండని శిశువును కాపాడిన కిమ్స్ కడల్స్ బృందం

- **సూరత్ నుంచి హైదరాబాద్‌కు 1300 కిలోమీటర్ల రోడ్డు ప్రయాణం**
- **వెంటిలేటర్ మీద పెట్టి 1.1 కిలోల శిశువును తీసుకొచ్చిన వైద్యులు**
- **ప్రపంచంలో ఇలాంటి సుదీర్ఘప్రయాణం ఇప్పటికి 723 కిలోమీటర్లే**
- **కిమ్స్ కడల్స్ లో శిశువుకు సంపూర్ణ చికిత్స.. పూర్తిగా కోలుకున్న బాబు**
- **ఇది గిన్నిస్ రికార్డు అవుతుందంటున్న వైద్యనిపుణులు**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 01 ( సిద్దిపేట పవర్) :**



అది గుజరాత్‌లోని సూరత్ నగరం. అక్కడున్న ఓ తెలుగు కుటుంబానికి నెలలు నిండకముందే, అంటే ఏడో నెలలోనే ఒక మగబిడ్డ పుట్టాడు. కానీ కేవలం 1.1 కిలోల బరువు మాత్రమే ఉన్న ఆ శిశువుకు.. అనేక ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తాయి. తీవ్రమైన సెప్సిస్, ఊపిరి అందకపోవడం, శరీరంలో పలు అవయవాలు పనిచేయకపోవడం లాంటివి వచ్చాయి. దాంతో అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించడం మొదలుపెట్టినా ఫలితం లేకపోవడంతో ఆ బాబు తండ్రి సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిని సంప్రదించారు. ఎయిర్ అంబులెన్సులో తీసుకొద్దామని ప్రయత్నించినా, ఆ తండ్రి ఆర్థిక ఇబ్బందుల కారణంగా రోడ్డు మార్గంలో తీసుకురావాల్సి వచ్చింది. అలా తీసుకొచ్చిన బృందానికి మార్గదర్శకత్వం వహించి, ఇక్కడ ఆ బాబుకు చికిత్స అందించి, పూర్తిగా కోలుకునేలా చేసిన కిమ్స్ కడల్స్ ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, చీఫ్ నియో నాటాలజిస్ట్ డాక్టర్ బాబు ఎస్. మదార్కర్ ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఓ చిరుద్యోగికి ఈ కష్టం వచ్చింది. అక్కడినుంచి ఇక్కడకు తీసుకురావడానికి ఎయిర్ అంబులెన్సు ఖర్చు తాను భరించలేనని ఆయన చెప్పడంతో రోడ్డు మార్గంలో తీసుకురావాలని నిర్ణయించాం. అయితే, అంత తక్కువ బరువుండి, నెలల నిండకముందే పుట్టి, అనేక ఆరోగ్య సమస్యలున్న శిశువును రోడ్డు మార్గంలో తీసుకురావడం చాలా కష్టంతో కూడుకున్నపని, 1300 కిలోమీటర్ల దూరం ఉండడంతో సుమారు 1416 గంటల ప్రయాణం అవుతుంది. అంతసేపూ బాబును వెంటిలేటర్ మీదే ఉంచాలి. అందుకు చాలా ఆక్సిజన్ అవసరం అవుతుంది. అందుకోసం బాబును తీసుకొచ్చే అంబులెన్సే కాకుండా, వెనకాల మరో అంబులెన్సును కూడా పెట్టాం. అందులో ఆక్సిజన్ సిలిండర్లు ఉన్నాయి. దారిలో నాసిక్‌లోను, మరికొన్నిచోట్ల సిలిండర్లు మార్చుకున్నాం.

మధ్యమధ్యలో బాబుకు శ్వాసపరమైన ఇబ్బంది, గుండె కొట్టుకునే రేటు మారడం లాంటి సమస్యలు తలెత్తాయి. అయినా నిపుణులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కూడా అంబులెన్సులో ఉండడంతో వెంటనే వాటిని సరిచేయగలిగారు. అంత సుదూర ప్రయాణం కావడంతో సిబ్బంది కూడా కొంత అనారోగ్యం పాలయ్యారు. కొందరికి వాంతులు అయ్యాయి, నీరసపడ్డారు. అయినా బాబును సురక్షితంగా సికింద్రాబాద్ చేర్చాలన్న ఏకైక లక్ష్యంతో అంతా కలిసి కష్టపడ్డారు. ఎందుకైనా మంచిదని మొత్తం మూడు బృందాలుగా వైద్యులు, నర్సులను పంపాం. ఈ బృహత్ ప్రయత్నంలో మొత్తం 31 మంది సిబ్బంది పాల్గొన్నారు. కిమ్స్ కడల్స్ మరియు రెడ్ హెల్త్ అంబులెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు మార్గం ద్వారా చిన్నారిని తరలించడంలో సహకరించారు. అలాగే 15 మంది వైద్యులు, నర్సులు, బయోమెడికల్ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది, 11 మంది బ్యాక్ ఎండ్ నిపుణులు, ఐదుగురు పరోక్ష సహాయ సిబ్బంది ఉన్నారు. వీరంతా నిర్విరామంగా కష్టపడి బాబును సురక్షితంగా సూరత్ నుంచి సికింద్రాబాద్ చేర్చారు. ఈ మార్గంలో కిమ్స్ అనుబంధ ఆస్పత్రులు ఆక్సిజన్ సిలిండర్లు అందించడం, ఇతర సాయం చేయడం కూడా చాలా ఉపయోగపడింది. ఇక్కడకు వచ్చిన తర్వాత పరీక్షిస్తే, బాబుకు మల్టీ ఆర్గాన్ సమస్యలు ఉన్నాయి. దాదాపు రెండు నెలల పాటు బాబును ఆస్పత్రిలో ఉంచి మంచి చికిత్స చేశాం. దాంతో ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. 1.9 కిలోల బరువుకు చేరుకున్నాడు. వెంటిలేటర్, ఆక్సిజన్ తీసేసినా సాధారణంగానే ఉన్నాడు. తల్లిపాలు తాగుతున్నాడు. వాళ్ల తాత కుటుంబం ఇక్కడే ఉండడంతో కొన్నాళ్లు నగరంలోనే ఉంటారు. మధ్యమధ్యలో ఫాలో అప్ పరీక్షలకు రావల్సి ఉంటుందని చెప్పాం. బాబు ఏడుస్తూ, ఆడుకుంటూ బాగా చురుగ్గా ఉన్నాడు. ప్రపంచంలో ఇప్పటివరకు ఇలా రోడ్డుమార్గంలో నెలలు నిండని శిశువులను తీసుకొచ్చిన గరిష్ఠ దూరం కేవలం 723 కిలోమీటర్లు మాత్రమే. అదే మన దేశంలో అయితే అది 513 కిలోమీటర్లే. అందువల్ల ఇది గిన్నిస్ రికార్డు అవుతుంది అని డాక్టర్ బాబు ఎస్. మదార్కర్ వివరించారు.బాబును తీసుకొచ్చిన బృందంలో డా సతీష్, డా రియాన్, డా సంతోష్, చిన్నా బ్రదర్, సనల్ బ్రదర్, అంబులెన్సు పైలట్లు ఆనంద్, మోహన్ ఉన్నారు. ఆస్పత్రితోపాటు కిమ్స్ ఫౌండేషన్ తరఫున సహాయం అందించిన సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు, ఆస్పత్రి సీఈఓ డా అభినయ్ బొల్లినేని తదితరులందరికీ బాబు తండ్రి కృతజ్ఞతలు తెలిపారు. తన బాబును కంటికి రెప్పలా కాపాడి, క్షేమంగా అప్పగించిన కిమ్స్ యాజమాన్యానికి, వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# గాంధీ ఆసుపత్రిని 3 వేల పడకలకు అప్ గ్రేట్ చేయాలి

- **సమస్యలను తీర్చాలని ప్రభుత్వానికి వినతి**
- **గాంధీ ఆసుపత్రిలో పీవైఎల్ ప్రతినిధుల పర్యటన**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 01 ( సిద్దిపేట పవర్) :**

రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆసుపత్రుల్లో ఒకటైన గాంధీ ఆసుపత్రి మూడు వేల పడకలతో, అన్ని సౌకర్యాలతో అప్ గ్రేట్ చేయాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీ.వై.ఎల్) నాయకులు డిమాండ్ చేశారు. వేల పడకల పరిమితిని కలిగి ఉన్నా, రోజూ దాదాపు రెండున్నర వేల మంది రోగుల ఇన్ పేషెంట్లు రావడంతో ఆసుపత్రిలో అనేక సౌకర్యాలతో రోగులు అవస్థ పడుతున్నారన్నారు. పి.వై.ఎల్ గ్రేటర్ హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రిని సందర్శించారు. రోగులతో, వారి సహాయకులతో మాట్లాడారు ఎమర్జెన్సీ బ్లాక్ ఇతర ఓ.పి బ్లాకులను సందర్శించారు. వారి దృష్టికి వచ్చిన సమస్యలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజకుమారి దృష్టికి తీసుకెళ్లారు. ఎమర్జెన్సీ వార్డులో నీళ్లు పై నుంచి లీకవుతున్నాయని, టాయిలెట్స్ వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని, స్కానింగ్ మెషిన్లు ఒకటే పని చేయడంతో పేషెంట్లు 10, 15 రోజులు డేట్లు ఇస్తున్నారని, ఓపికౌంటర్లు సరిపోక గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించి ఇబ్బందులు తొలగించాలని లేనియెడల ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.పీ.వై.ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం . రవికుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు బి.ఎస్. కృష్ణ కొల్లూరు భీమేష్, హైదరాబాద్ ఉపాధ్యక్షులు కుంబోజి కిరణ్, కే. మల్లేష్, సహాయ కార్యదర్శులు బంగారు శ్రీనివాస్, బాలు, నగర కోశాధికారి ప్రకాష్, నగర నాయకులు రాజు, సాయి, అంజి, రాము, అశోక్,టీయూసీఐ నాయకులు తలారి వెంకటేష్ పాల్గొన్నారు.

# సి హెచ్ ఆర్ ట్రాస్ట్ చిలుకూరి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్, ఉచిత మెగా వైద్య శిబిరం

జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామం నందు గ్రామ చిలుకూరి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా చిలుకూరి బాల్ రెడ్డి ట్రాస్ట్ చైర్మన్ చిలుకూరి మధు సుధాన్ రెడ్డి డాక్టర్ లు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు కంటి పరీక్షలతో పాటు చెవి,ముక్కు,గొంతు,వరిబీజము, బీజకుట్టు,గడ్డలు,కనతులు, థైరాయిడ్ గడ్డలు,గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్యక్రమమునకు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు ముఖ్యతిధిగా హాజరైయ్యారు. ఈ వైద్య శిబిరంలో op 117మందికి షుగర్, బీపీ, టెస్టులు చేయడం జరిగినది,ఆపరేషన్ అవసరము ఉన్న వాళ్ళ 35మందిని రిఫర్ రాయడం జరిగింది.వీరిని మెడిసిటీ హాస్పిటల్ కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుంది.ఈ వైద్య శిబిర కార్యక్రమంలో డాక్టర్లు , చందన, లోహిత, బ్రింద అమూల్య, అమృత మార్కెటింగ్ ఇన్చార్జి,సుధాకర్ శేఖర్, సాయిసుకేష్ తదితరులు పాల్గొన్నారు.





# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తాల జలంధర్ గౌడ్**
- **పర్యావరణ పరిరక్షణ కై మక్తాల దంపతులకు**
- **సేవ భూషణ్ జాతీయస్థాయి పురస్కారం-2025**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 01 ( సిద్దిపేట పవర్):**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తాల జలంధర్ గౌడ్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగిన మహాకవి శ్రీ దాశరధి కృష్ణమాచార్యుల శతజయంతి సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శతాధిక కవులకు ఘన సన్మాన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పలువురికి అవార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తాల పద్మ జలంధర్ గౌడ్ దంపతులకు సేవా భూషణ్ జాతీయ స్థాయి అవార్డును లయన్ డా. జి మహేంద్ర కుమార్, డిస్ట్రిక్ట్ గవర్నర్, 320ఎ, లయన్ డా. ఇ.యస్. సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. అనంతరం సేవా భూషణ్ జాతీయ అవార్డు గ్రహీత జలంధర్ గౌడ్ మాట్లాడుతూ..ఈ అవార్డు తనకు రావడం ఎంతో సంతోషంగా గర్వకారణంగా ఉందనీ, ఈ అవార్డు తనపై మరింత బాధ్యతని పెంచుతుందనీ అన్నారు.ప్రస్తుతం పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం అనేక విషపూరితమైన వాయువుల వల్ల పర్యావరణం ప్రకోపించడం ఓజోన్ పొర మందగించి పోవడంతో సూర్యుడు ద్వారా వచ్చే కిరణాలు నేరుగా భూమిపై పడటం వల్ల జీవకోటి అనారోగ్య పాలవుతుంది తెలిపారు. ప్రస్తుతం పెరిగిపోతున్న గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో ఎప్పుడు ఎండ ఉంటుందో ఎప్పుడు వర్షం పడుతుందో అనేది తెలియకుండా పోతుందనీ వెల్లడించారు. ప్రస్తుతం స్వచ్ఛమైన ఆక్సిజన్ తీసుకోవాలంటే డబ్బులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందనీ దానిని అధిగమించాలంటే ప్రస్తుతం ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ, తమ పుట్టినరోజు పెళ్లిరోజు మరియు ప్రత్యేకమైన రోజులలో తమకు వీలైన చోట మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా ప్రయత్నం చేసినట్లయితే. పచ్చదనాన్ని పెంచుకోవడంతో పాటు గ్లోబల్ వార్మింగ్ ను అడ్డుకట్ట వేసినవారమవుతామనీ అలాగే ప్రతి ఇంటి వద్ద, షాపుల వద్ద మొక్కలను, చెట్లను పెంచే వారికి ప్రభుత్వం పన్నుల్లో రాయితీలు ఇస్తే అది ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తాల ఫౌండేషన్ సభ్యులు మక్తాల పద్మవతి, కె. వెంకటేష్, అంజనేయులు, ఎ. కృష్ణ పాల్గొన్నారు.

# దుబ్బాక ప్రాంతీయప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

- **దుబ్బాక వంద పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమ్రా రాజ్ సింగ్**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 1 ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతీయ వందపడకల ఆసుపత్రిలోడాక్టర్ హేమ్రాజ్ సింగ్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఆయురారోగ్యాలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఆసుపత్రిలో వినాయక నవరాత్రులు ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందని డాక్టర్ హేమ్రాజ్ సింగ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బొజ్జ గణపయ్యకు అంగరంగ వైభవంగా నవరాత్రులను జరుపుకుంటామని వారు భగవంతుని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంట ప్రజలందరూ ఎలాంటి జబ్బులు రాకుండా చూడాలని బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.







# వైభవంగా గణనాథునికి గరక పూజ

- సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు
- ఘనంగా లక్ష్మీ గణపతి హోమం
- అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు కృతజ్ఞతలు

**దుబ్బాకసిద్దిపేట్ పవర్, న్యూస్ సెప్టెంబర్ 1 ప్రతినిధి**

వినాయక నవరాత్రి ఉత్సవంలో భాగంగా వీర్ సవర్కర్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుని వద్ద సోమవారం రోజున మహిళలచే సామూహిక కుమార్చన , లక్ష దర్భార్లతో గణనాథునికి ప్రత్యేక పూజ అనంతరం గణపతి హోమం ఘనంగా నిర్వహించే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్, ఎస్సై కీర్తి రాజులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు సవర్కర్ గణేష్ మండపం అధ్యక్షులు చింత మణికంఠ స్వరాజ్ గుప్త మాట్లాడుతూ... నేడు నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఆ గణనాథుని ఆశీస్సులతో దుబ్బాక ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థించమన్నారు. ఇట్టి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# తిమ్మాపూర్ అనంతసాగర్ గ్రామాలను సందర్శించిన అడిషనల్ డైరెక్టర్ తెలంగాణ డాక్టర్ అమర్ సింగ్

- జిల్లా వైద్య అధికారి ధన్ రాజ్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:**

అడిషనల్ డైరెక్టర్ తెలంగాణ డాక్టర్ అమర్ సింగ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ తో కలిసి జిల్లాలోని తీగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాలను టీ హబ్ ను అకస్మికంగా తనిఖీ నిర్వహించ్చారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఈ తనిఖీలో భాగంగా జ్వర పీడిత గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను దోమల మందు పిచికారి చేస్తున్న ఇండ్లను ఆయన పరిశీలించారు. గ్రామాల్లోని వీధులు తను స్వయంగా సంతోషిస్తూ దోమలు అభివృద్ధి చెందే ప్రదేశాలను, మురికి కాల్వలను, నీరు నిలువ ఉన్న పాత్రలు, పూల తొట్టిలు, కూలర్లు, వాడిపడేసిన టైర్లు, కొబ్బరి చిప్పలు, కొబ్బరి బోండాలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, రోళ్ళు, పగిలిన సీసాలు, పగిలిపోయిన పాత్రల్లో, టైర్లలో, కొబ్బరి చిప్పల్లో,పాత కుండలు మొదలగు నీటి నిల్వలు ఉండే పాత్రలను ఆయన స్వయంగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ, నీటి నిల్వ ఉన్న పాత్రల్లో తోక పురుగులు ఉంటే ఆ నీటిని తొలగించాలని, ఆ నీటిని తొలగించకపోతే, ఈరోజు తోక పురుగులే రేపు దోమలుగా వృద్ధి చెందుతాయని తద్వారా దోమ కాటు వలన వచ్చే వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా మొదలగు వ్యాధుల నుండి రక్షించుకోవచ్చు అని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది సమానమయంతో ప్రతిరోజు డ్రై డే తోపాటు, ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే తోపాటు ఇతర ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకోవాలని, దోమలు పుట్టకుండా పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డి యం హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్.డ్యూపిటి డి యం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అరుణ్ కుమార్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మలేరియా వైద్యాధికారులు డాక్టర్ రాజశేఖర్, ఎపిడమాలజిస్ట్ సోఫాన్,హెచ్ ఇవో చక్రదర్ యస్ యు ఓ శ్రీనివాస్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ ఘటనపై సమగ్ర విచారణ జరుపాలి

- అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ కి వినతి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**



జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా విష జ్వరాలు డెంగ్యూతో ప్రజల ఇబ్బంది పడి డెంగ్యూతో ముగ్గురు మృతి చెందిన విషయంలో పారిశుధ్యం పనులు సక్రమంగా నిర్వహించ లేదని జిల్లా కలెక్టర్ గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపద్యంలో డిపిఓ ఇచ్చిన నివేదికలో గ్రామ కార్యదర్శి ఒకరిని బాధ్యులను చేస్తూ కలెక్టర్ కి నివేదిక ఇచ్చారు. ఈ విషయంలో కిందిస్థాయి ఉద్యోగి దళితుడు కాబట్టే అతని ఒక్కడినే బాధ్యులను చేశారు. ఇది కచ్చితంగా కుల వ్యవక్షత కింద వర్తిస్తుందని గ్రామ స్పెషల్ ఆఫీసర్ అయిన ఎంపీడీవో రెడ్డిని ఎందుకు బాధ్యులను చేయలేదు. డిపిఓ ఇచ్చిన నివేదిక పైన సమగ్ర విచారణ జరపాలని ఈ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలంలో అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్ ని కలిసి వినతపత్రం అందజేసిన గ్రామస్తులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో విషజ్వరాల వల్ల భయభ్రాంతులకు గ్రామస్తులు గురవుతున్నారని గ్రామస్తుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక డాక్టర్ల తోటి కొద్ది రోజుల పాటు పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. జగదేవపూర్ మండల ఎంపీడీవో ఏదైనా సమస్య ఉందని చెప్పుకుందాం అంటే కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదన్నారు. ఎంపీడీవో రామిరెడ్డి పైన కచ్చితంగా మండలంలో సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ గిరిమ అగర్వాల్ స్పందిస్తూ మీరు ఇచ్చిన దరఖాస్తు పైన సమగ్ర విచారణ చేపిస్తా బాధ్యుల పైన చర్యలు తప్పకుండా తీసుకుంటాం. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోసానిపల్లి రాజు తిమ్మాపూర్ గ్రామానికి సంబంధించిన పోసాన్ పల్లి సాయిలు, గుంద్రు సుదర్శన్, పోసానిపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు కేటాయిస్తున్నాం విష జ్వరాలపై శాంపిల్స్ సేకరించి ఢిల్లీకి పంపిస్తున్నాం

**జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్**

తిమ్మాపూర్ లో డ్రైనేజీ కోసం నిధులు కేటాయిస్తున్నాం సోమవారం గ్రామంలో ఎన్ని మీటర్ల డ్రైనేజీ అవసరం ఉందో ఎస్టిమేషన్ వేయమని అధికారులను పంపించాం అదేవిధంగా విష జ్వరాల పైన శాంపిల్స్ స్వీకరించి ఢిల్లీకి పంపించాం నివేదికలు వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు కచ్చితంగా తీసుకుంటాం. తిమ్మాపూర్ లో హెల్త్ క్యాంపు పెట్టి ఎప్పటికప్పుడు ప్రజల యొక్క ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్నాం పూర్తయ్యే వరకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాం

# ఎన్పిడిసియల్ లో ఎస్సీ,ఎస్టీ లైజనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**దుబ్బాక సిద్ధిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 1 ప్రతినిధి**




@రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ శ్రీ.బక్కి వెంకటయ్య ఆదేశం.

ఎన్పీడీసిఎల్ లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నియమాకాలు, బదిలీలు, ప్రమోషనులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోతే ఉపేక్షించబోమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.

అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్పిడిఎస్ లో ఎస్సీ ఎస్టీల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎస్సీ ఎస్టీ లైజనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు.

హన్మకొండ విద్యుత్ భవన్ లో ఎన్పీడీఎస్ లో ఎస్సీ,ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ల పై సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్ష సమీక్షలో ఎస్ఎస్సి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకొకసారి పి ఎన్ సి సమావేశాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.

ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాలను ఎందుకు పిలవలేదని అధికారులను నిలదీసి వారి సమావేశానికి పిలవాలని అదేశించారు.ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు దానయ్య,శ్రీరామ్ నాయక్ లు తమ సమస్యల పై చర్చించి వినతిపత్రాలు అందజేశారు.

ఉద్యోగ సంఘాల నాయకులు లేవనెత్తిన సమస్యల సియండి దృష్టి కి తీసుక వెళ్ళి పరిష్కారిస్తామని హమి ఇచ్చారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారం పై నెల రోజులలో యాక్షన్ టెకెన్ రిపోర్టు సమర్పించాలని చైర్మన్ అధికారులను అదేశించారు.

కమిషన్ ఎస్సీ ఎస్టీ లకు కస్టొడియన్ గా పని చెస్తాదని,కమిషన్ కార్యాలయానికి వచ్చి పిర్యాదులు ఇవ్వాలని సూచించారు.

సమీక్షా సమావేశం అనంతరం చైర్మన్ వెంకటయ్య ఎన్పీడీసీఎల్ అధికారులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సమావేశంలో చైర్మన్ వెంకటయ్య తో పాటు కమిషన్ సభ్యురాలు కుస్రం నీలా దేవి,సభ్యులు రేణికుంట్ల ప్రవిణ్,జిల్లా శంకర్,రాముబాబు నాయక్,ఎన్పిడిసియల్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మోహన్ రావు,హెచ్ఆర్డి డైరెక్టర్ ప్రభాకర్ ,ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి,డిబిఎఫ్ నేతలు కొరివి వినయ్ కుమార్, పి.శంకర్,చుంచు రాజేందర్ లు పాల్గొన్నారు.




# పుస్తక పఠనం మంచి అలవాటు

**చేర్యాల, సెప్టెంబర్ 1 (సిద్దిపేట పవర్)**

రూమ్ టు రీడ్ రాష్ట్ర హెడ్ కేఎన్ చారి

చేర్యాల మండలంలోని నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

సోమవారము నాడు రీడ్థాన్ కార్యక్రమమును నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర విద్యాశాఖ సమన్వయంతో 'రూమ్ టు రీడ్' అనే స్వచ్ఛంద సంస్థ సెప్టెంబరు ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు మారథాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భాగంగా తెలంగాణ రాష్ట్ర హెడ్ సి కె నరసింహ చారి సోమవారం రోజున నాగపురి పాఠశాలకు విచ్చేసి విద్యార్థులచే ఉదయం 11 గంటల నుండి 11: 30 వరకు పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా కే నరసింహ చారి గారు మాట్లాడుతూ పుస్తక పఠనం ఒక మంచి, గొప్ప అలవాటని, ఇది పాఠకులకు ఎంతో మేధాశక్తిని పెంపొందించుతుందని అన్నారు. దీనిని ప్రతి పాఠశాలలో ప్రతిరోజు ప్రతి విద్యార్థితో పాటు ఉపాధ్యాయులందరూ పుస్తక పఠనం గావించాలని అన్నారు.

ఈ అనే కార్యక్రమము ప్రపంచంలో 27 దేశాల్లో మరియు మనదేశంలో 14 రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని అన్నారు. సిద్దిపేట జిల్లాలో ప్రస్తుతం 30 పాఠశాలల్లో అమలు చేస్తున్నామని అందులో భాగంగా చేర్యాల మండలంలో ఏడు పాఠశాలల్లో అమలుపరుస్తున్నామని తెలిపారు. ఈ విధమైన రీడింగ్ వల్ల యువకుల్లో, విద్యార్థుల్లో శ్రవణ మరియు జీవన నైపుణ్యాలు మెరుగవుతాయని తెలిపారు ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది కేఎన్ చారి గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలుకట్టే ఐలయ్య ఉపాధ్యాయులు ఎస్ కృష్ణమూర్తి టి పద్మ ఏ విజయ్ కుమార్ జి ప్రకాష్ రెడ్డి సి హెచ్ యాదగిరి కే స్వర్ణ కుమార్ జి శ్రీధర్ ఎం శ్రీనివాసరావు బీ ధనలక్ష్మి ఎండి ఉమర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి..

- శ్రీ సిద్ధి వినాయక నవరాత్రుల అన్నదన కార్యక్రమంలో పాల్గొన్న
- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నేత పూజల గోపీకృష్ణ

సిద్దిపేట పట్టణ లోని బాల గంగాధర్ తిలక్ యూత్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన అన్నదాన కార్యక్రమం లో వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపీ కృష్ణ గారు.అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు తీసుకోవటం జరిగింది.సిద్దిపేట ప్రజలు శుక సంతోషలతో వర్ధిల్లాలి అని కోరడం జరిగింది.అనంతరం యూత్ సభ్యులు పూజల గోపీ కృష్ణ గారిని గణగంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాయి నాథ్ గౌడ్.విజయ్ మోహన్.రాజేందత్. నరెన్. మరియు చెంది శ్రీనివాస్.సాయి ప్రతాప్.వంశీ. అశోక్.సాయి.తదితరులు పాల్గొన్నారు.





# సిద్ధిపేట జిల్లా ఫిషర్మెన్ ప్రధాన కార్యదర్శి గుండె వెంకట్ ని ఘనంగా సన్మానించిన చిన్నకోడూరు గంగపుత్ర సంఘం మహిళలు

**చిన్నకోడూరు సెప్టెంబర్ 1. న్యూస్.**

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో సోమవారం నాడు గంగపుత్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా ఫిషర్మెన్ ప్రధాన కార్యదర్శి గుండె వెంకట్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు మహిళలు భారీగా పాల్గొన్నారు. వారు చేసిన సేవలను కొనియాడారు.వారి అభిప్రాయం మేరకు మెట్టు సాయి కుమార్ కి మహిళల సమస్యను తెలుపగా మహిళల కొరకు మహిళా సొసైటీని ఏర్పరుస్తానని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుండు వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు పంపరి వినోద, గుండు మల్లవ్వ, లక్ష్మి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుడిసె లక్ష్మయ్య బీసీ ఏ కులాల ఉపాధ్యక్షుడు పంపరీ కనకయ్య, కనుగుల లక్ష్మయ్య, రమేష్ ,దానయ్య తదితరు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ స్కీం అమలు చేయాలి

**సికింద్రాబాద్, సెప్టెంబర్01 ( సిద్దిపేట పవర్) :**

నో కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (NCPS) రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (OPS) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఈరోజు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టీజీఈ జేఏసీ యూనియన్ కోఆర్డినేటర్ జి.వి.కృష్ణారావు హాజరయ్యారు.ఆర్టీసీ కళ్యాణం ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశంలో ఎయిడెడ్ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రెసిడెంట్ రాజేందర్, అనిల్, సాయికుమార్, విజయ్‌కుమార్, శోభా, లావణ్య, పద్మ, కె.కాళు, అభిషేక్, శ్రీనివాస్, గౌరి తదితరులు పాల్గొన్నారు.




# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**




జగదేవపూర్ మండల కేంద్రంలో రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరుతూ జాతీయ రహదారి పైన 200 మందికి పై ధర్నాకు దిగారు. ఈ క్రమంలో రైతులు వేకువ జామునే సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకోగా యూరియా బస్తాలు రాలేదు అని తెలియడంతో మూకుమ్మడిగా కలిసి వెళ్ళి ధర్నాకు దిగారు. రైతులకు బాసటగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు సీఎం డౌన్ డౌన్ అంటూ రైతులు ఆందోళన చేశారు. వ్యవసాయ అధికారి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి మరో రెండు మూడు రోజుల్లో యూరియా వస్తుందని రైతులందరికీ అందించే ఏర్పాటు చేస్తామని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమం లో బుద్ధ నాగరాజు చిలుకూరి మధుసూదన్ రెడ్డి దాచారం కనకయ్య కొంపల్లి మహేష్ జుర్రు ఐల్లయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దిష్టి వాక్యాలు సరైనవి కావు

**చేర్యాల, సెప్టెంబర్ 1 (సిద్దిపేట పవర్)**

భారత ప్రధాని గౌరవనీయులు శ్రీ నరేంద్ర మోడీ మాతృమూర్తి పై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ చేర్యాల మండల కేంద్రంలో చేర్యాల బిజెపి మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ మరియు పట్టణ అధ్యక్షులు కర్క తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది... బీహార్లో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యాలను అభ్యంతరకరంగా ఉన్నాయని వాటిని ఉపసరించుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు ఈ నిరసనలో బిజెపి రాష్ట్ర నాయకులు బూరుగు సురేష్ గౌడ్ , రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్ర మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు పోతుగంటి రాందాస్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు,పట్టణ ప్రధాన కార్యదర్శి పంగ సిద్ధి లింగం ,మన్నె సత్య వర్ధన్, కాటం సురేందర్, కుర్రారం బాల నరసయ్య, ఈది రెడ్డి,మండల ఉపాధ్యక్షులు బయ్యారపు యాదగిరి, కేతోజు చంద్రశేఖర్ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి కాలకుంట్ల మనీష్, మండల కార్యదర్శి పోలోజు రవి చారి, గుడ్ల అంజయ్య, వెలుగల వినయ్ కుమార్, ఉట్లపల్లి సురేష్, రవీందర్ రెడ్డి, మారబోయిన మహేష్, కేతోజు సాయికుమార్ చారి, చిన్నమల్ల రాజు, గుంటి రాములు, బిట్ల వెంకటేష్ ,ఖాత నాగరాజు, ఆవుల నవీన్, సందీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం

**నంగునూరు, సెప్టెంబర్ 1 ( సిద్దిపేట పవర్)**

నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో శ్రీ విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ శనిగరం బాబు సహకారంతో అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి శనిగరం బాబు విగ్నేశ్వర కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



# బొప్పాయితో బోలెడు లాభాలు !



బొప్పాయి పండు ఎంతో ఆరోగ్యకరమైనదని.. పోషకాల గని అని ఆహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు 30 దాటాక ఈ పండును కచ్చితంగా తీసుకోవాలంటున్నారు. బొప్పాయిలో ఎటువంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో ఈ కథనంలో తెలుసుకుందాం..

## సీ విటమిన్ పుష్కలం..!

బొప్పాయిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. బొప్పాయిలో ఫోలేట్, విటమిన్ ఎ, ఫైబర్, కాపర్, మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా లభిస్తాయి, ఇవి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

## గుండెకు మంచిది..!

బొప్పాయిలో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ వంటి యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఈ పండు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి.
అసిడిటీ ప్రాబ్లం ఉన్నోళ్లకు కూడా..!
జీర్ణ సంబంధిత వ్యాధులతో బాధపడేవాళ్లకు సైతం బొప్పాయి ఎంతో మేలు చేస్తుంది.
జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది:
బొప్పాయిలో ఉండే ఎంజైమ్‌లు మెరుగైన జీర్ణక్రియ కారణంగా జీర్ణక్రియకు సహాయపడతాయి.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది: విటమిన్ సి పుష్కలంగా ఉన్న ఈ పండును తినడం వల్ల మీ రోగనిరోధక శక్తి పెరుగుతుంది, బాక్టీరియా , వైరల్ వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని శరీరం చేస్తుంది. బొప్పాయి విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉన్న పండు., ఇది మీ రోగనిరోధక శక్తిని వేగంగా పెంచుతుంది.

## వెయిట్ లాస్ కోసం కూడా..!

బరువు తగ్గాలనుకునే మహిళలకు బొప్పాయి చాలా మేలు చేస్తుంది. ఇందులో ఎక్కువ ఫైబర్ , తక్కువ కేలరీలు ఉంటాయి. అటువంటి పరిస్థితిలో, దీన్ని తినడం ద్వారా, మీ కడుపు చాలా సేపటి వరకు నిండినట్లు అనిపిస్తుంది. అంతేకాకుండా దీనిని అతిగా తినకూడదు, బరువు తగ్గడం సులభం అవుతుంది. ఇక స్త్రీల చర్మం 30 ఏళ్ల తర్వాత వదులుగా మారడం ప్రారంభమవుతుంది, అలాంటి పరిస్థితుల్లో మహిళలు తమ ఆహారంలో బొప్పాయిని తీసుకోవాలి. విటమిన్ సి, విటమిన్ ఇ, బీటా కెరోటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న ఈ పండు ముడతలు రాకుండా చేస్తుంది.



# కొండలెక్కండి.. కేలరీలు కరిగించుకోండి..!

నడక ఎంత మంచిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో నడక అందరికీ అత్యవసరం. అయితే నడకలో కూడా అనేక రకాలు ఉన్నాయి. ఎలా నడిస్తే మన ఆరోగ్యం బాగుంటుంది? బరువు తొందరగా తగ్గుతాం? అన్న విషయాలపై నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.

## హంసనడక.. నత్తనడక పనికిరాదు..!

చాలా మంది వాకింగ్ చేస్తున్నామంటూ చిన్నగా నడుస్తూ ఉంటారు. ఇటువంటి హంసనడకల వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని నిపుణులు సూచిస్తున్నారు. గంటకు కనీసం 5 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో నడవాలని సూచిస్తున్నారు. నడక వేగం పెరిగితేనే గుండె వేగం పెరిగి శక్తి ఖర్చు అవుతుందట. ఇది క్యాలరీలు బర్నింగ్‌ను పెంచుతుంది. చదునైన ఉపరితలంపై నడవడం కంటే వాలుపై నడవడానికి ఎక్కువ శక్తి అవసరం. కొండలు, గుట్టలు ఎక్కడం వల్ల ఎక్కువ కేలరీలు కరిగించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వయసు పెరిగే కొద్దీ జీవక్రియ మందగిస్తుంది. ఫలితంగా, టీనేజర్లు పెద్దల కంటే ఎక్కువ కేలరీలు బర్న్ చేస్తారు. ఆడవారితో పోలిస్తే మగవారు కండరాలు బలంగా ఉండటం కారణంగా ఎక్కువ కేలరీలు బర్న్ చేస్తారు. ఫిట్ వ్యక్తులు తక్కువ కేలరీలు ఖర్చు చేస్తారు. వారి శరీరం మరింత సమర్థవంతంగా మారుతుంది. ఫిట్‌నెస్ లేని వ్యక్తులు ఎక్కువ కేలరీలు ఖర్చు చేస్తారు. ఎందుకంటే వారు కష్టపడి పనిచేయాలి. శరీర బరువును బట్టి కేలరీలు ఏవిధంగా ఖర్చవుతాయి. 55 కిలోల బరువున్న వ్యక్తి గంటకు 5 కి.మీ వేగంతో నడిచినట్లయితే, అతను కిలోమీటరుకు 50 నుండి 60 కేలరీలు బర్న్ చేసే అవకాశం ఉంటుంది. కానీ, నిర్దిష్ట సంఖ్య వేగం, స్థానాన్ని బట్టి మారుతుంది. 70 కిలోల బరువున్న వ్యక్తి కిలోమీటరుకు 60 నుండి 75 కేలరీలు బర్న్ చేస్తాడు. చదునైన నేలపై మితంగా నడవడం తక్కువ, ఎత్తైన ప్రదేశంలో నడవడం కంటే ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తుంది. 90 కిలోల బరువున్న వ్యక్తి ఒక కిలోమీటర్ నడవడం ద్వారా 80 నుండి 100 కేలరీలు బర్న్ చేయవచ్చు.





# ఇవి తిన్నారంటే మీ లివర్ ఖతమ్..!

కేవలం మద్యపానం, ధూమపానం చేసేవాళ్లకు మాత్రమే లివర్ డ్యామేజ్ అవుతుందని చాలా మందిలో ఓ నిశ్చితాభిప్రాయం ఉంటుంది. కానీ కొన్ని రకాల పుడ్స్ కూడా లివర్ ను డ్యామేజ్ చేస్తాయట. లివర్ అనేది మన శరీరంలో ఎంతో కీలకమైన ఆర్గాన్. కాబట్టి దీన్ని కాపాడుకోవడం అత్యవసరం. మరి లివర్ పాడవ్వకుండా ఉండాలంటే ఇటువంటి ఫుడ్ కు దూరంగా ఉండాలని చెబుతున్నారు నిపుణులు. లివర్ లో ఉన్న గొప్ప లక్షణం ఏమిటంటే.. మూడు వంతులు పాడైపోయినా మళ్లీ దానంతట అదే బాగవుతుంది. కానీ మొత్తం పాడైపోతే మనల్ని ఎవరూ కాపాడలేరు.. కాబట్టి లివర్ ను కాపాడుకోవాలి. లివర్ బాగుండాలంటే ఈ కింది పుడ్స్ కు దూరంగా ఉండండి.





## చక్కెర, మైదా పదార్థాలు

చక్కెర ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి హానికరం. ఎందుకంటే ఇందులో కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. బేకరీ పుడ్స్, వైట్ బ్రెడ్, వైట్ రైస్, పేస్ట్రీలు, పాస్తా, స్వీట్లు ఇవన్నీ కూడా మైదాతో తయారు చేస్తారు. మైదాలో జీరో కార్బ్స్, ప్రొటీన్స్ ఉంటాయి. కాబట్టి ఇవి మన ఆరోగ్యానికి మంచివి కావు.

## పిండిపదార్థాలు

కార్బొహైడ్రేట్లు కూడా ఎక్కువ మోతాదులో తీసుకోకూడదు. ఇవి కాలేయాన్ని డ్యామెజ్ చేస్తాయి. దీని వల్ల ఫ్యాటీ లివర్ గా మారుతుందని వైద్యులు చెబుతున్నారు.

## రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన ఫుడ్స్ :

మనలో చాలా మంది జంగ్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఫుడ్స్, రెడ్ మీట్ ఎక్కువగా తినే అలవాటు ఉంటుంది. రసాయనాలతో తయారు చేసిన ప్రాసెస్ ఫుడ్ కాలేయానికి హాని కలిగిస్తుంది.

## కూల్ డ్రింక్స్:

శీతలపానీయాలు అత్యంత డేంజరస్ అని వైద్యు చెబుతున్నారు. వీటిని తాగితే లివర్ తొందరగా పాడైతుందని అంటున్నారు. చక్కెర, తీపి పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల కాలేయానికి మంచిది కాదని ఇదంతా లివర్ లో పేరుకుపోయి కొవ్వుగా మారుతుందని చెబుతున్నారు. ఫలితంగా కాలేయం పనితీరు దెబ్బతీస్తుంది. ఉప్పు కూడా ఎక్కువగా తీసుకుంటే కాలేయం ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తున్నారు

